సాక్షి నల్లగొండ

సోమవారం । 6 । నవంబర్ । 2023



జాబ్ క్యాలెండర్ ప్రకటించాలి

ఎంజీయూలో 'సాక్షి' నిర్వహించిన పీపుల్స్ ఎజెండాలో జాబ్ క్యాలెండర్ ప్రకటించాలని పలువురు విద్యార్థులు కోరారు. - 10లో



'ముడుంబై' సేవలు మరువలేనివి

ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత ముడుంబై రామానుజాచార్యుల సేవలు మరువలేమని వక్తలు అన్నారు. - 10లో



యాదాద్రిలో త్రిపుర గవర్నర్

యాదాద్రి లక్ష్మీనరసింహస్వామి క్షేత్రాన్ని ఆదివారం రాత్రి త్రిపుర గవర్నర్ నల్లు ఇంద్రాసేనారెడ్డి దర్శించుకున్నారు. - 10లో

న్యూస్‌రీల్

ప్రభుత్వ స్కూళ్లను బలోపేతం చేయాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ నర్సిరెడ్డి

దేవరకొండ: ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ప్రతిఒక్కరూ కృషి చేయాలని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి కోరారు. ఆదివారం దేవరకొండలోని రిటైర్డ్ ఉద్యోగుల సంఘం భవనంలో «ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలు – గమనం – గమ్యం» అనే అంశంపై నిర్వహించిన చర్చా వేదికలో ఆయన ప్రసంగించారు. ప్రభుత్వాలు విద్యారంగానికి పెద్దపీట వేస్తూ బడ్జెట్‌లో అవసరం మేరకు నిధులను కేటాయించాల్సిన అవసరం ఉందన్నారు. జీరో ఎన్‌రోల్‌మెంట్ ఉన్న ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెరిగేలా ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఉద్యోగుల సంఘం సభ్యులు, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

9, 10 తేదీల్లో క్రీడాకారులకు ఎంపిక పోటీలు

నల్లగొండ టూటౌన్: ఈనెల 9, 10వ తేదీల్లో మిర్యాలగూడలోని హౌసింగ్ బోర్డు కాలనీలో అండర్‌–19 విభాగంలో వివిధ క్రీడాంశాల్లో క్రీడాకారులకు ఉమ్మడి జిల్లా స్థాయి ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి వాసుదేవరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 19 ఏళ్ల లోపు బాలబాలికలకు 9న షటిల్ బ్యాడ్మింటన్, బాక్సింగ్, త్రోబాల్, 10వ తేదీ ఉదయం 10గంటలకు బాల్ బ్యాడ్మింటన్‌లో ఎంపిక పోటీలు నిర్వహించబడునని పేర్కొన్నారు. ఆసక్తి గలవారు ఇంటర్మీడియట్ వారైతే టెన్త్ మెమో జిరాక్స్, బోనఫైడ్ సర్టిఫికెట్లతో హాజరు కావాలని సూచించారు. పూర్తి వివరాలకు 88969 21234 నంబర్లు సంప్రదించాలని కోరారు.

ఎంఐఎం జిల్లా ప్రధాన కార్యదర్శిగా సిరాజుద్దీన్



నల్లగొండ: ఎంఐఎం పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఎండీ.సిరాజుద్దీన్ నియమితులయ్యారు. ఆ పార్టీ అధినేత అసదుద్దీన్ ఓవైసి ఆదేశాల మేరకు ఆదివారం జిల్లా అధ్యక్షుడు రియాజుద్దీన్ నియామక ఉత్తర్వులు అందజేశారు.

యాదాద్రిలో ఇద్దరు ఉద్యోగుల సస్పెండ్

యాదగిరిగుట్ట : యాదాద్రికి వచ్చే భక్తుల నుంచి డబ్బులు వసూలు చేస్తున్న రికార్డు అసిస్టెంట్, హోంగార్డుపై ఈఓ సస్పెన్షన్ వేటు వేశారు. ఇందుకు సంబంధించి ఆలయ డీఈఓ దోర్బల భాస్కరశర్మ తెలిపిన వివరాలిలా.. దేవస్థానం నిబంధనల ప్రకారం కొండపైకి వెళ్లే వాహనదారులు మూడవ ఘాట్‌రోడ్డు వద్ద రూ.500 టిక్కెట్ తీసుకోవలసి ఉంటుంది. ఇది కెనెరా బ్యాంకు ఆధ్వర్యంలో నడుస్తోంది. కాగా ఆలయంలో రికార్డు అసిస్టెంట్‌గా పనిచేస్తున్న యాదగిరి.. రూ.500 టికెట్‌లను భక్తులకు తిరిగి ఇస్తున్నాడు. పలువురు భక్తులకు అనుమానం రావడంతో ఈఓకు ఫిర్యాదు చేశారు. దీంతో ఈఓ గీతారెడ్డి, దేవస్థానం అధికారులు కొంత కాలంగా నిఘా పెట్టగా టికెట్లు రీసేల్ చేస్తున్నట్లు గుర్తించారు. వారిద్దరిని సస్పెండ్ చేసినట్లు డీఈఓ వెల్లడించారు. టికెట్‌లను ఎప్పటి నుంచి రీసేల్ చేస్తున్నాడు.. ఎన్ని విక్రయించాడని విచారణ జరుపుతున్నట్లు తెలిపారు.

రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన గోపినాథ్

శాలిగౌరారం: మండలంలోని ఊట్కూరు గ్రామానికి చెందిన తెలంగాణ విద్యార్థి ఉద్యమ నాయకుడు, సామాజిక కార్యకర్త వేముల గోపినాథ్ ఉస్మానియా, కాకతీయ, పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీలకు చెందిన విద్యార్థి ఉద్యమ నాయకులతో కలిసి హైదరాబాద్‌లో టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి సమక్షంలో ఆదివారం కాంగ్రెస్‌లో చేరారు. విద్యార్థులంతా అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపునకు కృషి చేయాలని రేవంత్‌రెడ్డి కోరినట్లు గోపినాథ్ సాయంత్రం స్థానికంగా విలేకరులకు తెలిపారు. తెలంగాణ ఉద్యమంలో క్రియాశీలక పాత్ర పోషించిన ఉద్యమకారులకు సముచిత స్థానం కల్పిస్తామని రేవంత్‌రెడ్డి తెలిపినట్లు గోపినాథ్ వెల్లడించారు.



రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరుతున్న, వేముల గోపినాథ్

పొత్తు ఖతం.. పోటీ ఖాయం

సీపీఎం, కాంగ్రెస్ వేర్వేరుగానే పోటీ

- మూడు స్థానాల్లో అభ్యర్థులను ప్రకటించిన సీపీఎం
- మిర్యాలగూడ నుంచి మళ్లీ బరిలో జూలకంటి రంగారెడ్డి
- నకిరేకల్, భువనగిరి నుంచి పోటీలో ప్రజా సంఘాల నాయకులు
- మూడు స్థానాల్లో ఇంకా ఖరారుకాని కాంగ్రెస్ అభ్యర్థులు
- పెండింగ్‌లోనే మిర్యాలగూడ, సూర్యాపేట, తుంగతుర్తి



సాక్షి ప్రతినిధి, నల్లగొండ: ఈ ఎన్నికల్లో సీపీఎం, కాంగ్రెస్ వేర్వేరుగా పోటీచేయనున్నాయి. పొత్తు కుదరకపోవడంతో విడివిడిగానే బరిలోకి దిగబోతున్నాయి. ఆదివారం సీపీఎం తమ అభ్యర్థుల జాబితాను కూడా ప్రకటించింది. మొదట్లో కాంగ్రెస్‌తో సీపీఐ, సీపీఎం పొత్తుకు సిద్ధమైనా.. కమ్యూనిస్టు పార్టీలు అడిగిన స్థానాలను కేటాయించే విషయంలో కాంగ్రెస్ పార్టీ నాన్చుడు ధోరణి ప్రదర్శించింది. దీంతో మునుగోడులో తాము ఫ్రెండ్లీ కాంటెస్ట్ చేస్తామని ప్రకటించగా, సీపీఎం ఒంటరిగా పోరుకు సిద్ధమైంది. ఇందులో భాగంగా తాము పోటీ చేయబోయే మూడు స్థానాలను ఇటీవల ప్రకటించిన సీపీఎం, ఆదివారం ఆయా స్థానాల్లో అభ్యర్థులను కూడా ప్రకటించింది. మిర్యాలగూడ, నకిరేకల్, భువనగిరి స్థానాలతో సహా రాష్ట్ర వ్యాప్తంగా 14 స్థానాల్లో పోటీలో ఉండే అభ్యర్థులను ప్రకటించింది. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ కూడా అభ్యర్థుల ప్రకటనకు సిద్ధమైంది. పొత్తు విషయంతో పక్కన పెట్టిన మిర్యాలగూడతో పాటు తుంగతుర్తి, సూర్యాపేట అసెంబ్లీ నియోజకవర్గ స్థానాలకు కూడా అభ్యర్థులను కాంగ్రెస్ పార్టీ సోమవారం ప్రకటించనుంది.

గెలుపు అవకాశాలున్న సీట్లివ్వడం ఇష్టం లేకనే..

గట్టిగా ప్రయత్నిస్తే తమకు గెలుపు అవకాశాలు ఉన్నాయని కాంగ్రెస్ భావిస్తున్న మిర్యాలగూడ వంటి స్థానాలను వదులుకునేందుకు ఆ పార్టీ ఇష్టపడటం లేదు. పైగా పొత్తులో సీపీఎంకు ఆ స్థానాన్ని కేటాయిస్తే కాంగ్రెస్ పార్టీ ఓట్లు సీపీఎంకు బదిలీ కావడం కష్టమేనన్న అంచనా వేసుకొని, కాంగ్రెస్ పార్టీ ఆ స్థానాన్ని సీపీఎంకు ఇచ్చే విషయాన్ని తేల్చకుండా పక్కన పెట్టినట్లు తెలిసింది. పైగా అక్కడ కాంగ్రెస్‌తో ఎంత పొత్తున్నా బీఆర్‌ఎస్‌ను సీపీఎం ఢీకొంటుందా? అన్న ఆలోచనలతో ఉన్న కాంగ్రెస్, కనీసం ఆ విషయాన్ని అయినా స్పష్టంగా సీపీఎంకు చెప్పలేదు. దీంతో సీపీఎం ఒంటరి పోరుకే మొగ్గుచూపింది. మిర్యాలగూడ నుంచి మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి, నకిరేకల్ నుంచి బొజ్జ చిన వెంకులు, భువనగిరి అసెంబ్లీ స్థానం నుంచి కొండమడుగు నర్సింహ పోటీలో ఉంటారని సీపీఎం ప్రకటించింది.

మూడు స్థానాలకు అభ్యర్థులను ప్రకటించని కాంగ్రెస్

కమ్యూనిస్టు పార్టీలతో పొత్తు కుదరకపోవడంతో మిర్యాలగూడలో కాంగ్రెస్ అభ్యర్థిని ప్రకటించాల్సి ఉంది. అక్కడ బత్తుల లక్ష్మారెడ్డి కాంగ్రెస్ టికెట్ కోసం తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. మరోవైపు జానారెడ్డి తనయుడు రఘువీర్‌రెడ్డి కూడా టికెట్ కావాలని దరఖాస్తు చేసుకున్నారు. పొత్తుల నేపథ్యంలో ఇన్ని రోజులు ఆ స్థానాన్ని పక్కన పెట్టిన కాంగ్రెస్ ఇప్పుడు ఆ ఇద్దరిలో ఎవరికి ఆ స్థానాన్ని కేటాయిస్తుందన్నది తేలాల్సి ఉంది. సూర్యాపేట, తుంగతుర్తి నియోజక వర్గాల్లోనూ అభ్యర్థులను ప్రకటించాల్సి ఉంది. సూర్యాపేటలో మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పటేల్ రమేష్‌రెడ్డి టికెట్ కోసం ప్రయత్నిస్తున్నారు. తుంగతుర్తిలోనూ టికెట్ ఆశిస్తున్న అద్దంకి దయాకర్, మోత్కుపల్లి నర్సింహులులో ఎవరికి కేటాయిస్తుందన్నది తేలాల్సి ఉంది.

జూలకంటి ఏడోసారి పోటీ



జూలకంటి రంగారెడ్డి



కొండమడుగు నర్సింహ



బొజ్జ చినవెంకులు

మిర్యాలగూడ అభ్యర్థి జూలకంటి రంగారెడ్డి 1978 నుంచి ప్రజా ఉద్యమాల్లో ఉన్నారు. డీవైఎఫ్‌ఐ, సీఐటీయూ సంఘాల్లో బాధ్యతలు నిర్వహించారు. ప్రస్తుతం ఆయన సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడిగా.. అఖిల భారత కిసాన్ సంఘం కార్యవర్గ సభ్యులుగా, రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఉన్నారు. రంగారెడ్డి 1987 నుంచి 1992 వరకు మిర్యాలగూడ మున్సిపల్ వైస్ చైర్మన్‌గా పనిచేశారు. 1994, 2004, 2009 ఎన్నికల్లో ఆయన మిర్యాలగూడ నుంచి సీపీఎం తరఫున బరిలో నిలిచి ఎమ్మెల్యేగా గెలుపొందారు. 1999, 2014, 2018లో పోటీచేసి ఓడిపోయారు. ప్రస్తుతం తిరిగి ఆయన సీపీఎం అభ్యర్థిగా బరిలో దిగుతున్నారు.

కార్మికసంఘం నేతనుంచి ఎమ్మెల్యే బరిలోకి

భువనగిరి అభ్యర్థి కొండమడుగు నర్సింహ ప్రస్తుతం వ్యవసాయ కార్మిక సంఘం యాదాద్రి భువనగిరి జిల్లా ప్రధాన కార్యదర్శిగా, సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడిగా ఉన్నారు. 1992 నుంచి నర్సింహ ప్రజా పోరాటాల్లో పాల్గొంటున్నారు. సీపీఎం చేపట్టిన పాదయాత్ర, బస్సుయాత్ర, సైకిల్ యాత్రల్లో పాల్గొన్నారు.

సర్పంచ్ స్థాయి నుంచి శాసనసభా ఎన్నికలకు..

సీపీఎం నకిరేకల్ అభ్యర్థి బొజ్జ చిన వెంకులు 1987నుంచి సీపీఎం సభ్యుడిగా కొనసాగుతున్నారు. 2001నుంచి 2006 వరకు కేతేపల్లి మండలం ఇనుపాముల సర్పంచ్‌గా పనిచేశారు. 2010 నుంచి సీపీఎం మండల కార్యదర్శిగా పనిచేశారు. 2013 నుంచి 2019 వరకు కేతేపల్లి పీఏసీఎస్ చైర్మన్‌గా ఉన్నారు. ప్రస్తుతం వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడిగా కొనసాగుతున్నారు.

మంత్రి జగదీష్‌రెడ్డికి మూడో స్థానమే..



కాంగ్రెస్‌లో చేరిన చిట్యాల మున్సిపల్ చైర్మన్ కోమటిరెడ్డి చిన్నవెంకటరెడ్డిని ఆలింగనం చేసుకుంటున్న ఎంపీ కోమటిరెడ్డి. చిత్రంలో నకిరేకల్ అభ్యర్థి వేముల వీరేశం తదితరులు

- చిరుమర్తి ఎక్కడి నుంచి వచ్చాడో అక్కడికి పోవడం ఖాయం
- ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి
- కాంగ్రెస్‌లో చేరిన చిట్యాల మున్సిపల్ చైర్మన్ కోమటిరెడ్డి చిన్నవెంకట్‌రెడ్డి

నల్లగొండ: ఈ ఎన్నికల్లో మంత్రి జగదీష్‌రెడ్డి మూడో స్థానానికి పరిమితం కావడంతోపాటు బీఆర్‌ఎస్ నకిరేకల్ అభ్యర్థి చిరుమర్తి లింగయ్య ఎక్కడి నుంచి వచ్చాడో అదే స్థానానికి పోవడం ఖాయమని కాంగ్రెస్ పార్టీ నల్లగొండ అభ్యర్థి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. చిట్యాల మున్సిపల్ చైర్మన్ కోమటిరెడ్డి చిన్నవెంకటరెడ్డితోపాటు ఓ కౌన్సిలర్, బీఆర్‌ఎస్‌కు చెందిన కార్యకర్తలు ఆదివారం నల్లగొండలోని ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి క్యాంపు కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి వారికి పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం కాంగ్రెస్ నకిరేకల్ అభ్యర్థి వేముల వీరేశంతో కలిసి మీడియాతో మాట్లాడారు. సైకిల్‌పై తిరిగిన జగదీష్‌రెడ్డికి రూ.5వేల కోట్ల ఆస్తులు ఎలా వచ్చాయని ప్రశ్నించారు. సూర్యాపేటలో తానూ ప్రచారం చేస్తానన్నారు. చిరుమర్తి లింగయ్య తన స్థాయిని మరిచి విమర్శలు చేస్తున్నారన్నారు. పార్టీ శ్రేణులు ఇంటింటికి వెళ్లి ప్రచారం చేసి, వేముల వీరేశాన్ని అధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ ఎన్నికల్లో ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని 12 నియోజక వర్గాల్లో 12 స్థానాలు కాంగ్రెస్ కైవసం చేసుకుంటుందని జోస్యం చెప్పారు. నకిరేకల్ అభ్యర్థి వేముల వీరేశం మాట్లాడుతూ అన్నం పెట్టిన కోమటిరెడ్డి బ్రదర్స్‌పై చిరుమర్తి లింగయ్య అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదని హితవు పలికారు. చిరుమర్తి మాటలను పార్టీ కార్యకర్తలు, నాయకులు జీర్ణించుకోలేకనే కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారని చెప్పారు.

ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలు పాటించాలి

- జిల్లా ఎన్నికల అధికారి కర్ణన్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ కర్ణన్

నల్లగొండ: ఎన్నికల కమిషన్ జారీ చేసిన మార్గదర్శకాలు పాటిస్తూ అసెంబ్లీ ఎన్నికల నామినేషన్ల పరిశీలన, ఉపసంహరణ, అభ్యర్థుల తుది జాబితా ప్రకటనలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా చూడాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఆర్‌వీ.కర్ణన్ సిబ్బందిని ఆదేశించారు. ఆదివారం కలెక్టరేట్‌లో రిటర్నింగ్ అధికారులు, ఎన్నికల సిబ్బందికి నామినేషన్ల పరిశీలన, ఉపసంహరణ, అభ్యర్థుల తుది జాబితా తయారు, పోస్టల్ బ్యాలెట్‌పై నిర్వహించిన అవగాహన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇప్పటివరకు అందిన నామినేషన్ పత్రాలను ఈనెల 13న పరిశీలించాలన్నారు. వరుస క్రమంలో గుర్తింపు పొందిన పార్టీలు, రిజిస్టర్డ్ పార్టీల అనంతరం స్వతంత్ర అభ్యర్థులకు గుర్తులు కేటాయించాలన్నారు. అభ్యర్థుల తుది జాబితా ఆధారంగానే బ్యాలెట్ పత్రాలు ముద్రణ జరుగుతుందని చెప్పారు. అధికారులంతా సమన్వయంతో పనిచేసి ఎన్నికల ప్రక్రియ సజావుగా పూర్తి చేయాలన్నారు.

నేడు, రేపు పీఓ, ఏపీఓలకు రెండో విడత శిక్షణ

ప్రిసైడింగ్ అధికారులు, సహాయ ప్రిసైడింగ్ అధికారులకు సోమ, మంగళవారా(6, 7 తేదీ)ల్లో ఎన్నికల నిర్వహణపై రెండో విడత శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. సోమ, మంగళవారాల్లో ఓపీఓలకు మొదటి విడత శిక్షణ ఉంటుందని పేర్కొన్నారు. పోయిన నెల అక్టోబర్ 27న నిర్వహించిన మొదటి విడత శిక్షణకు హాజరైన వారు సోమవారం, అక్టోబర్ 28న హాజరైన వారు మంగళవారం ఆయా నియోజకవర్గాల్లో నిర్వహించే రెండో విడత శిక్షణకు హాజరు కావాలన్నారు. ఈ శిక్షణలో ఎన్నికల విధులు నిర్వహిస్తున్న పీఓలు, ఏపీఓలు, ఓపీఓలు ఫారం–12ను ఎపిక్ కార్డ్ నంబర్, పార్ట్ నంబర్ ఇతర వివరాలతో నింపి పోస్టల్ బ్యాలెట్ జారీకి సమర్పించాలని సూచించారు. అనంతరం నిర్వహించే శిక్షణలో పోస్టల్ బ్యాలెట్ ఓటును అక్కడే ఏర్పాటు చేసిన ఫెసిలిటేషన్ సెంటర్‌లో వేయాలన్నారు. ఈ సమావేశంలో వివిధ నియోజకవర్గాల ఆర్‌ఓలు హేమంత్ కేశవ్ పాటిల్, జె.శ్రీనివాస్, రవి, చెన్నయ్య, శ్రీరాములు, దామోదర్, నోడల్ అధికారులు పాల్గొన్నారు.

మాదిగల శక్తిని దేశానికి చాటిచెప్పాలి

- ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ



నల్లగొండ రూరల్ : సమావేశంలో మాట్లాడుతున్న మంద కృష్ణమాదిగ

నల్లగొండ రూరల్, నకిరేకల్: మాదిగల శక్తిని దేశానికి చాటి చెప్పాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ పిలుపునిచ్చారు. ఎస్సీ వర్గీకరణ చేపట్టాని డిమాండ్ చేస్తూ ఈనెల 11న హైదరాబాద్‌లో నిర్వహించే మాదిగల విశ్వరూప మహాసభను విజయవంతం చేయాలని ఆదివారం నల్లగొండ పరిధిలోని మర్రిగూడెం, నకిరేకల్‌లో వేర్వేరుగా నిర్వహించిన ఎమ్మార్పీఎస్, అనుబంధ సంఘాల నియోజకవర్గ స్థాయి సన్నాహక సమావేశాలకు ఆయన హాజరై మాట్లాడారు. గతంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ మాదిగలను మోసం చేసిందన్నారు. బీజేపీ అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో ఎస్సీ వర్గీకరణ చేపడతామని హామీ ఇచ్చి మాట నిలబెట్టుకోలేదన్నారు. వచ్చే పార్లమెంట్ సమావేశాల్లో బిల్లు పెట్టి ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలన్నారు. మర్రిగూడెంలో జరిగిన సమావేశంలో ఎమ్మార్పీఎస్ సీనియర్ నేత బకరం శ్రీనివాస్‌మాదిగ, జిల్లా అధ్యక్షుడు ఇరిగి శ్రీశైలం, బొజ్జ దేవయ్యమాదిగ, మల్లెపాక వెంకన్న, నగేష్, గాదె రమేష్, వెంకన్న, కమలమ్మ, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. అలాగే నకిరేకల్‌లో ఆ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు మాచర్ల సైదులు మాదిగ అధ్యక్షతన జరిగిన సమావేశంలో రాష్ట్ర నాయకులు బోడ సునీల్, కందికంటి అంజయ్య, మేడి శంకర్, బొజ్జ వేణుగోపాల్, నర్సయ్య, వంటల ఆనంద్‌బాబు, వంగూరి రాంప్రసాద్, లింగాల వెంకన్న, చింత వెంకన్న, ఎరసాని గోపాల్, రమేష్, సతీష్, అనిల్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

యాదాద్రిలో భక్తుల రద్దీ

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి క్షేత్రానికి ఆదివారం భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. క్యూలైన్లు, ప్రసాద విక్రయశాల, బస్టాండ్, శ్రీసత్యనారాయణస్వామి వ్రత మండపం, కల్యాణకట్ట, పుష్కరిణి తదితర ప్రాంతాలన్నీ కోలాహలం మారాయి. ధర్మదర్శనానికి 3గంటలు, వీఐపీ దర్శనానికి గంటన్నర సమయం తీసుకున్నట్లు భక్తులు వెల్లడించారు. స్వామివారికి నిత్యాదాయం రూ.44,25,279 ఆదాయం సమకూరినట్లు ఆలయ అధికారులు వెల్లడించారు.



శ్రీస్వామిదర్శనం కోసం ప్రధానాలయంలో క్యూలో నిల్చున్న భక్తులు

ప్రజాస్వామిక తెలంగాణ సాధనకు కృషి

- తెలంగాణ పీపుల్స్ జేఏసీ ఉమ్మడి జిల్లా కన్వీనర్ దర్శనం నర్సింహ



కరపత్రం విడుదల చేస్తున్న నాయకులు

మిర్యాలగూడ టౌన్: తెలంగాణ ప్రజల ఆకాంక్షలకు అనుకూలంగా ప్రజాస్వామిక తెలంగాణ సాధనకు అన్ని రాజకీయ పార్టీలు, వ్యక్తులు కృషిచేయాలని తెలంగాణ పీపుల్స్ జాయింట్ యాక్షన్ కమిటీ (టీపీ జేఏసీ) ఉమ్మడి జిల్లా కన్వీనర్ దర్శనం నర్సింహ, కోకన్వీనర్ పన్నాల గోపాల్‌రెడ్డి కోరారు. ఈ నెల 13న టీపీ జేఏసీ ఆధ్వర్యంలో నల్లగొండ నిర్వహించనున్న బహిరంగ సభ కరపత్రాన్ని ఆదివారం మిర్యాలగూడలోని తెలంగాణ అమర వీరుల స్థూపం వద్ద విడుదల చేసి మాట్లాడారు. బీఆర్‌ఎస్, బీజేపీలను ఈ ఎన్నికల్లో ఓటు ద్వారా తరిమికొట్టాలని పిలుపునిచ్చారు. ప్రజలు మద్యం, డబ్బు ఇతర ప్రలోభాలకు లొంగకుండా ఓటెయ్యాలన్నారు. కార్యక్రమంలో రామయ్య, భిక్షమయ్య, మంద రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుల సంక్షేమానికి కేసీఆర్ పెద్దపీట



మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ పార్టీ నల్లగొండ అభ్యర్థి కంచర్ల భూపాల్‌రెడ్డి

- బీఆర్‌ఎస్ పార్టీ నల్లగొండ అభ్యర్థి కంచర్ల భూపాల్‌రెడ్డి

నల్లగొండ టూటౌన్: దివ్యాంగుల సంక్షేమానికి సీఎం కేసీఆర్ పెద్దపీట వేశారని బీఆర్‌ఎస్ నల్లగొండ ఎమ్మెల్యే అభ్యర్థి కంచర్ల భూపాల్‌రెడ్డి అన్నారు. ఆదివారం నల్లగొండ పట్టణంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో జరిగిన దివ్యాంగుల ఆత్మీయ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మూడోసారి అధికారంలోకి రాగానే దివ్యాంగుల పెన్షన్ రూ.4,016 నుంచి దశలవారీగా రూ.6,016 వరకు పెంచుతామని తెలిపారు. దివ్యాంగులు బీఆర్‌ఎస్ అండగా ఉండి సీఎం కేసీఆర్‌ను మూడోసారి ముఖ్యమంత్రిని చేయాలని పిలుపునిచ్చారు. మాయమాటలు చెబుతూ వస్తున్న నాయకుల మాటలు నమ్మవద్దన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ సీనియర్ నేత చకిలం అనిల్‌కుమార్, నాయకులు కందుల లక్ష్మయ్య, పెరిక శ్రీనివాసులు, అంజిరెడ్డి, ఉపేందర్, వెంకన్న, దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.



నల్లగొండలో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనానికి హాజరైన దివ్యాంగులు

పుణ్యక్షేత్రాలకు స్పెషల్ బస్సులు

- 19 నుంచి అందుబాటులోకి
- ఆన్‌లైన్‌లో టికెట్ బుకింగ్‌కు అవకాశం



భానుపురి (సూర్యాపేట): సంస్థను గాడిలో పెట్టేందుకు రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ఏ అవకాశాన్ని వదులుకోవడం లేదు. పండుగల సమయంలో ప్రత్యేక బస్సులు, గిఫ్టుల పేరుతో ప్రయాణికులను ఆకర్షించింది. కార్తీకమాసాన్ని పురస్కరించుకుని పుణ్యక్షేత్రాలకు ఆర్టీసీ బస్సులు నడపనుంది. ఇలా సందర్భాన్ని బట్టి ప్రత్యేక సర్వీసులను నడుపుతోంది.

ప్రజల అభిరుచి మేరకు..

కార్తీక మాసంలో రాష్ట్ర వ్యాప్తంగా పండుగ వాతావరణం నెలకొంటుంది. ప్రధానంగా ఈ మాసంలో ప్రజలు దేవాలయాలను దర్శించుకుంటారు. రాష్ట్రంలోని పలు ఆలయాలకు సకాలంలో బస్సులు నడవకపోవడంతో ప్రజలు ప్రైవేట్ వాహనాలను ఆశ్రయిస్తున్నారు. దీనిని గమనించిన ఆర్టీసీ యాజమాన్యం ప్రయాణికులను తమ వైపు తిప్పుకునేందుకు ప్రయత్నాలు మొదలుపెట్టింది. ఇందులో భాగంగా రాష్ట్రంలోని ప్రముఖ పుణ్యక్షేత్రాలకు ప్రత్యేక ప్యాకేజీలతో బస్సులు నడపాలని నిర్ణయించింది. నల్లగొండ రీజియన్ పరిధిలోని అన్ని డిపోల నుంచి పంచరామాలు, డెక్కన్ శైవక్షేత్రాలు, అరుణాచలం, శబరిమలకు ఈ ప్రత్యేక బస్సులు నడపనుంది.

నల్లగొండ రీజియన్ నుంచి పుణ్యక్షేత్రాలకు బస్సుల వివరాలు

డిపో	పంచారామాలు	శబరిమల	అరుణాచలం	శైవక్షేత్రాలు
దేవరకొండ	12	04	03	03
నల్లగొండ	15	02	03	03
నార్కట్‌పల్లి	02	01	01	02
మిర్యాలగూడ	14	04	03	02
యాదగిరిగుట్ట	08	02	02	03
కోదాడ	08	02	03	03
సూర్యాపేట	11	05	03	04

సద్వినియోగం చేసుకోవాలి

ప్రయాణికుల అభిరుచి మేరకు పలు పుణ్యక్షేత్రాలకు బస్సులు నడుపుతున్నాం. ఆలయాలకు వెళ్లే ప్రయాణికులు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించాలి. సురక్షితమైన ప్రయాణానికి ఆర్టీసీ పెట్టింది పేరు. చార్జీలను ప్రతి ఒక్కరికీ అనుకూలంగా ఉండేలా నిర్ణయించాం. ఆయా డిపోల్లో సంప్రదించి టికెట్లు బుక్ చేయించుకోవాలి. – శ్రీదేవి, ఆర్‌ఎం, నల్లగొండ

షెడ్యూల్ ప్రకటించిన అధికారులు

కార్తీకమాసం సందర్భంగా ఈనెల 19వ తేదీ నుంచి నల్లగొండ రీజియన్ పరిధిలోని అన్ని డిపోల నుంచి పంచరామాలు, డెక్కన్ శైవ క్షేత్రాలు, అరుణాచలం, శబరిమలకు ప్రత్యేక బస్సులతో సంస్థ అధికారులు షెడ్యూల్ ప్రకటించారు. అమరావతి, భీమవరం, పాలకొల్లు, ద్రాక్షారామం, సామర్లకోట, డెక్కన్ పంచశైవ క్షేత్రాలుగా పిలవబడే వేములవాడ, కాళేశ్వరం, రామప్పగుడి, వేయి స్తంభాల గుడి, పాలకుర్తిలకు ప్రతి ఆదివారం ఆయా డిపోల నుంచి బస్సులు బయలుదేరి సోమవారం దర్శనాలు చేయించి మంగళవారం తిరిగి రానున్నాయి. ఆయా డిపోల నుంచి రానుపోను చార్జీలను పిల్లలకు, పెద్దలకు వేర్వేరుగా వసూలు చేయనున్నారు. ఆన్‌లైన్ ద్వారా టికెట్లు బుక్ చేసుకునే వెసులుబాటును ఆర్టీసీ కల్పించగా.. పేమెంట్లను గూగుల్‌పే, ఫోన్‌పేలో చెల్లించే వీలు కల్పించారు. టికెట్ల బుకింగ్‌కు సిబ్బందిని సైతం నియమించారు.

ఎన్నికల చిత్రాలు


ప్రచారంలో భాగంగా నల్లగొండలో వైద్య పరీక్షలు చేయించుకుంటున్న కాంగ్రెస్ అభ్యర్థి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి


కోదాడ పరిధిలోని బాలాజీనగర్‌లో గిరిజన వేషధారణలో కాంగ్రెస్ అభ్యర్థి పద్మావతి


ప్రచారంలో భాగంగా భువనగిరిలోని ప్రగతినగర్‌లో దప్పు కొడుతున్న బీజేపీ అభ్యర్థి గూడూరు నారాయణరెడ్డి


ఆత్మకూరు(ఎం) మండలం రహీంఖాన్‌పేటలో డోలు వాయిస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి బీర్ల అయిలయ్య


మునుగోడులో కాంగ్రెస్ సభలో వైఎస్సార్ వేషధారణలో కార్యకర్త

లాయర్ టు లీడర్



సూర్యాపేట, నాగార్జునసాగర్ : ఉమ్మడి నల్లగొండ జిల్లాలో పలువురు నేతలు తొలుత లాయర్లుగా తమ ప్రస్థానం మొదలు పెట్టి తర్వాత లీడర్లుగా ఎదిగారు. లాయర్లుగా రాణించిన వారు లీడర్లుగానూ తమ సత్తా చూపుతున్నారు.

గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి..



మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి 1986లో విజయవాడ సిద్ధార్థ లా కళాశాలలో న్యాయవాద విద్యను పూర్తి చేశారు. అనంతరం హైకోర్టు, నల్లగొండ కోర్టులో న్యాయవాదిగా ప్రాక్టీస్ చేశారు. 2001లో టీఆర్‌ఎస్‌లో చేరి తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటులో కేసీఆర్‌తో పాటు ఉద్యమంలో కీలకపాత్ర పోషించారు. 2009లో హుజూర్‌నగర్ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసి ఓటమి పాలయ్యారు. 2014లో సూర్యాపేట నుంచి పోటీ చేసి గెలుపొందారు. ఆయనను సీఎం కేసీఆర్ విద్యాశాఖ మంత్రిగా ఎంపిక చేశారు. 2018లో కూడా సూర్యాపేట నుంచి గెలుపొంది విద్యుత్ శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టారు.

నోముల భగత్..



నాగార్జునసాగర్ ఎమ్మెల్యే నోముల భగత్ హైకోర్టు అడ్వకేట్‌గా ప్రస్థానం మొదలు పెట్టారు. తెలంగాణ ఏర్పాటైన తర్వాత 2014 ఎన్నికల్లో నోముల నర్సింహయ్య నాగార్జునసాగర్ నుంచి టీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేసి కుందూరు జానారెడ్డిపై ఓటమిపాలయ్యారు. 2018 ఎన్నికల్లో జానారెడ్డిపై గెలుపొందారు. రెండు సంవత్సరాల తర్వాత అనారోగ్యంతో నర్సింహయ్య మరణించారు. తర్వాత జరిగిన ఉప ఎన్నికలో నర్సింహయ్య కుమారుడైన భగత్ టీఆర్‌ఎస్ నుంచి పోటీ చేసి గెలుపొందారు. ప్రస్తుత ఎన్నికల్లోనూ ఆయన బరిలో ఉన్నారు.

ఎంసీ కోటిరెడ్డి..



మిర్యాలగూడ మున్సిప్ మెజిస్ట్రేట్ కోర్టు న్యాయవాదిగా వృత్తిలో చేరిన ఎంసీ కోటిరెడ్డి అంచెలంచెలుగా ఎదిగి, నేడు ఉమ్మడి నల్లగొండ జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా ఎదిగారు. నాగార్జునసాగర్‌లోని బోయగూడెం కోటిరెడ్డి స్వగ్రామం. జిల్లా ఐదవ అదనపు జడ్జి కోర్టు మిర్యాలగూడలో ఏర్పాటు కాగానే అక్కడ ప్రాక్టీస్ చేశాడు. అదే కోర్టులో పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా పనిచేశారు. 2014 ఎన్నికల తర్వాత టీఆర్‌ఎస్‌లో చేరారు. రెండు సార్లు ఎమ్మెల్యే టికెట్ ఆశించినా దక్క లేదు. 2022 శాసన మండలి ఎన్నికల్లో ఆయన ఉమ్మడి నల్లగొండ జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా టీఆర్‌ఎస్ నుంచి బరిలో నిలిచి గెలుపొందారు.

జంగ్ తెలంగాణ

జాబ్ క్యాలెండర్ ప్రకటించాలి



- చదువుకు తగ్గ ఉద్యోగం, ఉపాధి కల్పించే బాధ్యత ప్రభుత్వానిదే..
- విద్య, వైద్యం ఉచితంగా అందించాలి
- యూనివర్సిటీల్లో వసతులు మెరుగుపర్చాలి
- ఓటు అమ్ముకుంటే జీవితం అంధకారమే..
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలి
- 'సాక్షి' పీపుల్స్ ఎజెండాలో మహాత్మాగాంధీ యూనివర్సిటీ విద్యార్థులు

పీపుల్స్ ఎజెండా


పీపుల్స్ ఎజెండాలో పాల్గొన్న ఎంజీయూ విద్యార్థులు

కుంభం వెంకటేశ్వర్లు, నల్లగొండ రూరల్

స్వరాష్ట్రంలో మా బతుకులు బాగుపడుతాయని భావిస్తే.. నిరుద్యోగులుగా మారి తల్లిదండ్రులకు భారంగా మారాం. ఉద్యోగ నోటిఫికేషన్లు అరకొరగా వేసినా పేపర్ల లీకేజీ వల్ల అవి ముందుకు సాగకపోవడంతో మానసికంగా కుంగిపోతున్నాం. చదువుకు తగ్గ ఉద్యోగం లేదు. కనీసం ఉపాధి మార్గాలు లేవు. యూనివర్సిటీల్లో వసతులు లేవు. ఉచిత విద్య, వైద్యం అందని ద్రాక్షగానే మారిందని చెబుతున్నారు నల్లగొండలోని మహాత్మాగాంధీ యూనివర్సిటీ విద్యార్థులు. ఎన్నికల నేపథ్యంలో 'సాక్షి' నిర్వహించిన పీపుల్స్ ఎజెండాలో తమ బాధలు చెప్పుకున్నారు.

తెలంగాణ రాష్ట్రం ఏర్పడితే తమ కలలు నెరవేరుతాయని ఆశించిన విద్యార్థులు, యువత నిరాశ, నిస్పృహల మధ్య కాలం వెల్లదీస్తున్నారు. వయస్సు మీద పడుతున్నా సరైన ఉపాధి దొరకక నిరుద్యోగులుగానే మిగులుతున్నారు. సంక్షేమ పథకాల అమలుపై దృష్టి పెట్టిన ప్రభుత్వం.. యువతకు ఉపాధి కల్పించే మార్గాలను అన్వేషించడం లేదని యువత ఆవేదన చెందుతోంది. ఉద్యోగ క్యాలెండర్ అమలు చేయాలని, విద్య, ఉపాధి రంగాలపై ప్రభుత్వం దృష్టి సారించాలని నిరుద్యోగులు కోరుతున్నారు. విద్య, వైద్యం ఉచితంగా అందించాలని, యూనివర్సిటీల్లో వసతులు పెంచాలని, నిరుద్యోగులకు ఉపాధి కల్పించేలా పథకాలు రూపొందించాలని డిమాండ్ చేస్తున్నారు. ఓటు సక్రమంగా ఉపయోగిస్తే భవిష్యత్ బాగుంటుందని.. ఓటు అమ్ముకుంటే జీవితం అంధకారం అవుతుందని చెబుతున్నారు. ప్రస్తుతం ఎన్నికల సందర్భంగా ఓటు విలువపైన స్వచ్ఛంద సంస్థలు, ప్రభుత్వాలు ప్రజలకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని పేర్కొంటున్నారు.

చదువుకు తగ్గ ఉద్యోగం ఉండాలి



విద్యార్థుల చదువుకు తగ్గట్టుగా ఉద్యోగాలు, ఉపాధి అవకాశాలు ఉండాలి. ఉద్యోగ నోటిఫికేషన్ క్యాలెండర్ విడుదల చేయాలి. ఉద్యోగుల వయో పరిమితి పెంచడంతో నోటిఫికేషన్లు లేక నిరుద్యోగుల వయస్సు మీరుతోంది. యువతకు కనీసం ఉపాధి అవకాశాలు కల్పించాల్సిన బాధ్యత పాలకులపై ఉంది. హోటళ్లు, చాయ్ దుకాణాలు, కూరగాయల కొట్టు పెట్టుకోవడానికి పీజీలు, డిగ్రీలు అవసరం లేదు కదా. – సిరి

నిరుద్యోగ భృతి ఇవ్వాలి



యువతకు నిరుద్యోగ భృతి ఇవ్వాలి. చదువు, ఉద్యోగ ప్రిపరేషన్ కోసం వేల రూపాయలు ఖర్చు చేస్తున్నాం. ఫీజులు కట్టడం, పుస్తకాలు కొనుగోలు చేయడం ఆర్థిక భారంగా మారింది. ప్రభుత్వం నిరుద్యోగ భృతి ఇస్తే పేద విద్యార్థులకు ఆర్థిక సమస్యలు ఉండవు. పేదలు ఆర్థికంగా ఇబ్బందుల పడుతుండడంతో ఉన్నత విద్య డబ్బులున్న వారికే అందుతోంది. – వెంకటేష్

కాంట్రాక్ట్ ఉద్యోగాలను ఎత్తివేయాలి



ఉద్యోగ నోటిఫికేషన్‌కు విడుదల చేయాలి. వాచ్‌మెన్ నుంచి ఉన్నత స్థాయి వరకు సివిల్ సర్వీస్ తరహాలోనే నోటిఫికేషన్ ఉండాలి. అవుట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగాలు పూర్తిగా ఎత్తివేయాలి. ఉద్యోగ క్యాలెండర్ ఉంటే ప్రతి ఒక్కరూ ప్లాన్ ప్రకారం భవిష్యత్‌ను నిర్ణయించుకుంటారు. పాలకులకు చిత్తశుద్ధి ఉండాలి. – జ్యోతి

ప్రభుత్వ విద్య ప్రాధాన్యం తగ్గుతోంది



నాయకులు ప్రైవేట్ యూనివర్సిటీలు, కళాశాలలు ఏర్పాటు చేయడానికి అధికారం ఉపయోగించి ఏర్పాటు చేయడంతో ప్రభుత్వ ఆధీనంలో ఉండే యూనివర్సిటీలు, కళాశాలల ప్రాధాన్యం తగ్గింది. పాలకులు విద్యను వ్యాపారంగా మార్చుకున్నారు. దీనివల్ల ప్రభుత్వ విద్య ప్రాధాన్యం తగ్గింది. – ఆదర్శ్

ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వాలి



ఉన్నత విద్యనభ్యసించేందుకు ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వాలి. సకాలంలో ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వకపోవడంతో కళాశాల యాజమాన్యాలు సర్టిఫికెట్లు ఇవ్వడం లేదు. ప్రాజెక్టుల పేరిట రూ.లక్షల కోట్లు అక్రమాలు పాల్పడుతున్న పాలకులు పేద విద్యార్థుల చదువుకు మాత్రం ప్రాధాన్యం ఇవ్వడంలేదు. ఎన్నికైన నాయకుడు ప్రజల సంక్షేమాన్ని విస్మరిస్తే మరోసారి ఎన్నుకోవద్దు. – సాయికుమార్

యూనివర్సిటీలను బలోపేతం చేయాలి



యూనివర్సిటీల్లో పూర్తిస్థాయిలో వసతులు కల్పించాలి. ఇక్కడ అనేక ఆవిష్కరణలు జరగాలి. ఎక్స్‌పోర్ట్ విజిట్‌లు ఉండాలి. ప్లేస్‌మెంట్‌లు భారీ గా ఉండాలి. విద్యార్థుల భవిష్యత్‌కు ఉపయోగపడే విధంగా యూన్నివర్సిటీల్లో సౌకర్యాలు మెరుగు పర్చాలి. సామాజిక అవగాహన కల్పించేలా తరగతులు నిర్వహించాలి. ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేలా చదువు ఉండాలి. – బింధు ప్రియ

ఉచిత వైద్యం అందించాలి



ప్రస్తుతం కుటుంబ సంపాదనలో 80 శాతం విద్యా, వైద్యానికే ఖర్చు అవుతోంది. వైద్యానికి కొంత ప్రోత్సాహం ఇచ్చినట్లు కనిపించినా పూర్తిస్థాయిలో అందడం లేదు. ప్రైవేట్ ఆస్పత్రుల దోపిడీపై పర్యవేక్షణ ఉండాలి. కార్పొరేట్ స్థాయిలో ఉచితంగా వైద్యం అందించాలి. సీఎంతో సహా అధికారులు కూడా ప్రభుత్వ ఆస్పత్రిలోనే వైద్యం పొందాలి. – స్పందన రేఖ

ఫ్లయింగ్ స్క్వాడ్ వాహనాలకు సీసీ కెమెరాలు


మిర్యాలగూడలో ఫ్లయింగ్ స్క్వాడ్ టీం వాహనానికి ఏర్పాటు చేసిన సీసీ కెమెరా

చండూరు, మిర్యాలగూడ టౌన్: అసెంబ్లీ ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించేందుకు ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు అధికారులు మరింత అప్రమత్తమయ్యారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరిగినా.. ఫిర్యాదు అందిన 100 నిమిషాల లోపే ఆ సమస్యను పరిష్కరించే దిశగా చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా ఫ్లయింగ్ స్క్వాడ్ తిరిగే వాహనాలకు 360 డిగ్రీల కోణంలో తిరిగే సీసీ కెమెరాలను అమర్చారు. ఈ కెమెరా ఫుటేజీని జిల్లా, డివిజనల్ రిటర్నింగ్ అధికారులు తమ కార్యాలయాల్లోనే ఉండి పర్యవేక్షించేలా అనుసంధానం చేసినట్లు అధికారులు పేర్కొన్నారు.

సంక్షిప్తంగా అభ్యర్థుల ప్రొఫైల్

మిర్యాలగూడ : జూలకంటి రంగారెడ్డి
తల్లిదండ్రులు : జూలకంటి కాశిరెడ్డి, లక్ష్మమ్మ
పుట్టిన తేదీ : 04–03–1955
స్వస్థలం : కొత్తగూడెం, తిప్పర్తి మండలం
కుటుంబం : భార్య సుజాత, కుమారుడు సుందర్, కుమార్తె శైలజ
చదువు : మెట్రిక్యులేషన్

నకిరేకల్ : బొజ్జ చినవెంకులు
స్వస్థలం : రాయపురం(ఇనుపాముల), కేతేపల్లి మండలం
పుట్టిన తేదీ : 03.04.69
తల్లిదండ్రులు : మరియమ్మ, రాంచంద్రయ్య
కుటుంబం : భార్య వెంకటమ్మ, పిల్లలు మౌనిక, మాధురి
చదువు : ఇంటర్మీడియట్

భువనగిరి : కొండమడుగు నర్సింహ
పుట్టిన తేదీ : 08–08–1976
స్వస్థలం : ముత్తిరెడ్డిగూడెం, భువనగిరి మండలం
తల్లిదండ్రులు : కొండమడుగు సాయమ్మ, బాలయ్య
కుటుంబం : భార్య నాగమణి, పిల్లలు చరణ్ తేజ్, తన్మయి
చదువు : ఇంటర్మీడియట్

అసెంబ్లీ బరిలో 'జిల్లా సాధన సమితి'

మిర్యాలగూడ: మిర్యాలగూడ జిల్లా ఏర్పాటే లక్ష్యంగా ఏర్పాటైన 'మిర్యాలగూడ జిల్లా సాధన సమితి' తరఫున అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసేందుకు సిద్ధమవుతున్నారు. మిర్యాలగూడను జిల్లాగా ఏర్పాటు చేయాలని గత రెండేళ్లుగా ఉద్యమం చేస్తున్నా ప్రధాన పార్టీలు పట్టించుకోకపోవడంతో ఉద్యమ తీవ్రతను ప్రజల్లో తీసుకెళ్లేందుకు మిర్యాలగూడ నియోజకవర్గం నుంచి పోటీ చేయనున్నట్లు జిల్లా సాధన సమితి సభ్యులు తెలిపారు. జిల్లా సాధన సమితి ఉద్యమకారుల్లో ఒకరిని పోటీలో ఉంచి, ఒకట్రెండు రోజుల్లో నామినేషన్ కూడా వేయనున్నట్లు సభ్యులు పేర్కొన్నారు.

పులిచింతల ప్రాజెక్టులో యువకుడు గల్లంతు

మేళ్లచెరువు: పులిచింతల ప్రాజెక్టు దిగువన కృష్ణా పుష్కరఘాట్ వద్ద యువకుడు గల్లంతయ్యాడు. ఈ ఘటన ఆదివారం చోటు చేసుకుంది. వివరాలు.. సూర్యాపేట జిల్లా మేళ్లచెరువు మండల కేంద్రానికి చెందిన యాంపంగు సందీప్(19) తన స్నేహితులు పాష, వెంకటేష్, నవీన్, సాయితో కలిసి కృష్ణా నదిలో ఈత కొట్టేందుకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పల్నాడు జిల్లా అచ్చంపేట మండలం మాదిపాడు గ్రామ పంచాయతీ పరిధిలోని జడపల్లి తండా సమీపంలోని పుష్కరఘాట్ వద్దకు వెళ్లారు. అందరూ కలిసి నదిలోకి దిగగా సందీప్ గల్లంతైనట్లు అతడి స్నేహితులు తెలిపారు. సమాచారం అందుకున్న అచ్చంపేట పోలీసులు అక్కడకు చేరుకొని కృష్ణా నదిలో వెతకడం ప్రారంభించారు. చీకటి పడడంతో గాలింపు చర్యలు ఆపినట్లు తెలిపారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి


సాయిరాం (ఫైల్)

రామగిరి(నల్లగొండ): పురుగుల మందు తాగిన యువకుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందాడు. ఈ ఘటన తిప్పర్తి మండలంలోని ఎల్లమ్మగూడెం గ్రామంలో జరిగింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎల్లమ్మగూడెం గ్రామానికి చెందిన నున్న వీరయ్య, సరిత దంపతుల కుమారుడు నున్న సాయిరాం(27) డిగ్రీ పూర్తి చేశాడు. తండ్రితో పాటు వ్యవసాయ పనులు చేస్తున్నాడు. శనివారం ఉదయం వీరయ్య గోదాంలో హమాలీ పనులకు, సరిత వ్యవసాయ పనులకు వెళ్లారు. మధ్యాహ్నం సమయంలో సాయిరాం ఇంట్లో గడ్డి మందు తాగాడు. స్థానికులు గమనించి నకిరేకల్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో హైదరాబాద్‌కు తీసుకెళ్లగా చికిత్స పొందుతూ ఆదివారం సాయంత్రం మృతిచెందాడు. కాగా సాయిరాం ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు. ఈ ఘటనపై పోలీసులను వివరణ కోరగా తమకు ఎటువంటి ఫిర్యాదు రాలేదని పేర్కొన్నారు.

చెరువులో పడి వ్యక్తి మృతి

కేతేపల్లి: చెరువులో చేపలు పట్టేందుకు వెళ్లిన వ్యక్తి ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతి చెందాడు. ఈ ఘటన కేతేపల్లి మండలంలోని గుడివాడ గ్రామంలో ఆదివారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ శ్రీకాంత్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. గుడివాడ గ్రామానికి చెందిన చెవుగాని జానయ్య(52) వృత్తిరీత్యా వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. గ్రామ సమీపంలోని చెరువులో గాలంతో చేపలు పట్టేందుకు వెళ్లిన జానయ్య చేపలు పడుతుండగా ప్రమాదవశాత్తు జారి చెరువులో పడి మునిగి మృతిచెందాడు. సాయంత్రం చెరువులో మృతదేహం తేలియాడుతుండడాన్ని గమనించిన గ్రామస్తులు పోలీసులకు సమాచారం అందించారు. దీంతో చెరువు వద్దకు చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని గుర్తించి బయటకు తీశారు. మృతుడి భార్య యల్లమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం తరలించి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

యాదాద్రికి చేరుకున్న త్రిపుర గవర్నర్


గవర్నర్ ఇంద్రాసేనారెడ్డికి స్వాగతం పలుకుతున్న బీజేపీ నాయకులు

యాదగిరిగుట్ట: ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారిని దర్శించుకునేందుకు త్రిపుర గవర్నర్ నల్లు ఇంద్రాసేనారెడ్డి ఆదివారం రాత్రి యాదాద్రి క్షేత్రానికి చేరుకున్నారు. ప్రెసిడెన్షియల్ సూట్‌లో రాత్రి బస చేసి.. సోమవారం (నేటి) ఉదయం 8గంటలకు యాదాద్రి కొండపైకి చేరుకొని స్వయంభూలను దర్శించుకోనున్నారు. అనంతరం ఆలయ పరిసరాలను పరిశీలిస్తారు. 9.30గంటల నుంచి 11గంటల వరకు యాదాద్రి కొండపైనే ఉండనున్నారు. 11గంటలకు భువనగిరి అతిథిగృహానికి వెళ్తారు. గవర్నర్‌గా నియమితులైన తరువాత ఆయన తొలిసారిగా యాదగిరిగుట్టకు వచ్చిన సందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు పీవీ శ్యాంసుందర్, జిల్లా ఇన్‌చార్జ్ శ్రీకాంత్, జిల్లా ప్రధాన కార్యదర్శి రాఘవుల నరేందర్‌తో పాటు పార్టీ నాయకులు ప్రెసిడెన్షియల్ సూట్‌లో స్వాగతం పలికారు.

50కిలోల గంజాయి పట్టివేత?

కోదాడరూరల్: కోదాడ మండలం రామాపురం క్రాస్ రోడ్డులోని అంతర్రాష్ట్ర సరిహద్దు చెక్‌పోస్టు వద్ద ఆదివారం పోలీసులు 50కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది. మహారాష్ట్రకు చెందిన ఇద్దరు మహిళలు, ఓ వ్యక్తి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని విశాఖపట్నంలో గంజాయి కొనుగోలు చేసి ప్రైవేట్ బస్సులో హైదరాబాద్‌కు తరలిస్తుండగా రామాపురం క్రాస్ రోడ్డు వద్ద పోలీసులకు పట్టుబడినట్లు సమాచారం. ఈ విషయంపై రూరల్ పోలీసులను సంప్రదించగా సోమవారం వివరాలు వెల్లడిస్తామని తెలిపారు.

ముడుంబై రామానుజాచార్యుల సేవలు మరువలేనివి


రామానుజాచార్యులు భౌతికకాయానికి నివాళులర్పిస్తున్న గుత్తా, ఎమ్మెల్యే భాస్కర్‌రావు


రామానుజాచార్యులు పార్థివదేహానికి నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి జానారెడ్డి

మిర్యాలగూడ: జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత ముడుంబై రామానుజాచార్యులు విద్య, సామాజిక రంగాల్లో చేసిన సేవలు మరువలేనివని శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, మిర్యాలగూడ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు అన్నారు. రామానుజాచార్యులు మృతిచెందిన విషయం తెలుసుకున్న వారు ఆదివారం మిర్యాలగూడ పట్టణం గీతామందిరం సమీపంలోని ఆయన నివాసంలో భౌతికకాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారి వెంట కౌన్సిలర్ వంగాల నిరంజన్‌రెడ్డి, నాయకులు జొన్నలగడ్డ రంగారెడ్డి, కర్నాటి రమేష్ తదితరులు ఉన్నారు.

నివాళులర్పించిన జానారెడ్డి..

మిర్యాలగూడ టౌన్: రామానుజాచార్యులు పార్థివదేహానికి మాజీ మంత్రి కుందూరు జానారెడ్డి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట డీసీసీ అధ్యక్షుడు శంకర్‌నాయక్, పగిడి రామలింగయ్యయాదవ్, గాయం ఉపేందర్‌రెడ్డి, చిరుమర్తి కృష్ణయ్య, సైదులు, దేశిడి శేఖర్‌రెడ్డి, నూకల వేణుగోపాల్‌రెడ్డి తదితరులున్నారు.

నిరంతర సాధనతో ఏదైనా సాధించవచ్చు


ఎన్‌ఎంఎంఎస్ టెస్ట్ ఆన్‌లైన్ శిక్షణ తరగతులను ప్రారంభిస్తున్న మీలా మహదేవ్ తదితరులు

సూర్యాపేట: నిరంతర సాధనతో ఏదైనా సాధించవచ్చని సుధాకర్ పీవీసీ ప్రొడక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ మీలా మహదేవ్ అన్నారు. సూర్యాపేట జిల్లా కేంద్రంలోని సుధాకర్ పీవీసీ ఇండస్ట్రీస్ కార్యాలయంలో ఆదివారం నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్(ఎన్‌ఎంఎంఎస్) టెస్ట్‌కు సంబంధించిన ఆన్‌లైన్ శిక్షణా తరగతులను ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఈ ఆన్‌లైన్ శిక్షణ తరగతులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అక్షర ఫౌండేషన్ విద్య, వైద్య, క్రీడా, సాంస్కృతిక, సామాజిక, సేవా రంగాల్లో చేస్తున్న సేవలను ఆయన అభినందించారు. ఈ ఆన్‌లైన్ శిక్షణకు 6,513 మంది విద్యార్థులు రిజిస్ట్రేషన్ చేసుకోవడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో అక్షర ఫౌండేషన్ ఫౌండర్, చైర్మన్ యాస రాంకుమార్‌రెడ్డి, సుధాకర్ పీవీసీ సంస్థ అకౌంట్స్ మేనేజర్ ఆమంచి అచ్యుతశర్మ, అక్షర ఫౌండేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ఉప్పు నాగయ్య, పాల్వాయి వెంకన్న, ఉపాధ్యక్షులు నరాల తిరుమల్‌రెడ్డి, సొల్లేటి ఉపేంద్రాచారి, వీర్లపాటి వెంకన్న, నజీర్ బాషా, నెల్లుట్ల పాపయ్య, దండ శంకర్‌రెడ్డి, సుభాష్ చంద్రబోస్ తదితరులు పాల్గొన్నారు.